కష్టపడ్డా దక్కని ఫలితం

- కూలీలకు దక్కని గిట్టుబాటు ధర
- తగ్గుతున్న కూలీల సంఖ్య
- తీవ్ర ఎండ ఉన్నా కన్పించని నీటి వసతి



రాజంపేటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రాజంపేట: ఉపాధి కూలీలకు శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదు. మండుటెండలో కష్టపడుతున్నా కనీస వేతనంలో సగం కూడా చేతికొస్తలేదు. పైగా గతంలో ఇచ్చిన వేసవి అలవెన్సు కూడా నిలిపిశారు. దీనికి తోడు అలెవెన్సు కింద రోజు వేతనానికి అదనంగా రూ.40 వరకు చెల్లించేవారు. ప్రస్తుతం ఇవ్వడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని చేసే చోట సౌకర్యాలు సైతం కల్పించడం లేదు. దీంతో చాలా గ్రామాలలో ఉపాధి హామీ పనులకు కూలీలు ఆసక్తి చూపడం లేదు. జిల్లా వ్యాప్తంగా 3,08,369 మంది ఉపాధి కూలీలు ఉండగా కేవలం 32,643 మంది మాత్రమే ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు దినసరి కూలి రూ.257 నుంచి రూ. 272 కు పెంచినా ఆ మేరకు చెల్లించడం లేదు. పనులు చేసే ప్రాంతంలో కూలీలు సేదతీరడానికి టెంట్లు, తాగునీటి సౌకర్యం, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాల్సి ఉన్నా అవి ఎక్కడా కన్పించడం లేదు.

గిట్టుబాటు అయితలేదు



ఉపాధి పనులకు వెళ్లే రూ. 120 మించి కూలి రావడం లేదు. కూలి రేట్లు రూ 272 పెంచినట్లు అధికారులు చెబుతున్నా అమలు చేయడం లేదు.

–పెద్దమ్మల నవీన్, రాజంపేట

అలవెన్సు డబ్బులు చెల్లించాలి



గతంలో మాదిరి కూలితో పాటు అలెవెన్సులు చెల్లించాలి. అదే విధంగా పెరిగిన కూలి రేట్లు ఆధారంగా వేతనాలు చెల్లించాలి.

–మహ్మద్ హాఫీజ్, రాజంపేట

కొలతల ప్రకారం చెల్లింపులు



కూలీలు చేసే పనిని బట్టి కొలతల ప్రకారం వేతనాలు చెల్లిస్తాం. ప్రభుత్వం దినసరి కూలి రూ.272 లకు పెంచింది. పనికి తగ్గ కూలీ రేటు చెల్లిస్తున్నాం.

–భాస్కర్, ఏపీఎం, రాజంపేట

పేదల సంక్షేమంపై దృష్టి సారించాలి

- నిరుపేదల సంక్షేమాన్ని మరిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఇంద్రకరన్‌రెడ్డి

భిక్కనూరు: పేదల సంక్షేమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరన్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వాలు వారి సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశాయని ఆరోపించారు. ఇటీవల మండలం ఇసన్నపల్లి గ్రామంలో మృతి చెందిన నిరుపేదలైన బొల్లం మహేష్, సల్లనర్సింలు, ఎర్రనోళ్ల భూదయ్య కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున ఆయన ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు బీంరెడ్డి, యాదగౌడ్, తిర్మల్‌స్వామి, రాములు, మంద బాబు, గౌడుగు రాములు పాల్గొన్నారు.

ప్రతిభకు సన్మానం



భిక్కనూరు: తిరుపతిలో ఈనెల 9, 10వ తేదీల్లో నిర్వహించిన తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో కవితా గానంతో సౌత్ క్యాంపస్‌లో ఎంఏ తెలుగు ద్వితీయ సంవత్సరం చదువుతున్న చింత ప్రసాద్ ప్రతిభ చూపారు. గురువారం తెలంగాణ యునివర్సిటీ రిజిస్ట్రార్ విద్యావర్ధిని చింత ప్రసాద్‌ను సన్మానించారు.

ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు

భిక్కనూరు: ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న వారి ఇళ్ల క్రమబద్ధీకరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం జంగంపల్లిలో జరిగిన సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యుడు కొత్త నర్సింలు, నాయకులు చంద్రశేఖర్, పేరం నర్సవ్వ, చంద్రకళ, ప్రవీన్, దేవరాజు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కన్వెక్స్ మిర్రర్ ఏర్పాటు



పెద్దకొడప్‌గల్: మండలంలోని 161 నంబర్ జాతీయ రహదారి నుంచి కౌలాస్ ఎల్లమ్మ దేవాలయం, పోచారం గ్రామాలకు వెళ్లే దారి మలుపు ప్రమాదకరంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు ఎస్సై కోనారెడ్డి హైవే సిబ్బంది సహాయంతో కన్వెక్స్ మిర్రర్‌ను ఏర్పాటు చేశారు.

పండుగను సంతోషంగా జరుపుకోవాలి



కిట్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ పద్మ

బాన్సువాడ రూరల్: నిరుపేద ముస్లింలు కూడా పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ సందర్భంగా దుస్తులు పంపిణీ చేస్తోందని జెడ్పీటీసీ పద్మ అన్నారు. గురువారం ఆమె తాడ్కోల్ గ్రామంలో సర్పంచ్ కుమ్మరి రాజమణి రాజు, బుడిమి సొసైటీ చైర్మన్ గంగుల గంగారంలతో కలిసి నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. పోచారం గ్రామంలో సర్పంచ్ రాధ, ఉప సర్పంచ్ బలరాంనాయక్, లతీఫ్, విజయ్‌గౌడ్, నరేష్‌గౌడ్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇందిరా రాజు, నాయకులు కుమ్మరి రాజు, లక్ష్మణ్‌గౌడ్, రాజిరెడ్డి, పంచాయితీ కార్యదర్శి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

గెలుపు ఓటములు సహజమే



రాజంపేట: ఆటల్లో గెలుపు ఓటములు సహజమని భిక్కనూర్ సీఐ తిరుపయ్య, రాజంపేట ఎస్సై రాజు అన్నారు. రాజంపేటలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి గురువారం బహుమతులతో పాటు నగదు అందజేశారు. మొదటి స్థానంలో రాజంపేట, ద్వితీయ స్థానం కొండాపూర్ జట్లు సాధించాయి. వీరికి ట్రోఫీలతో నగదు బహుమతులు అందజేశారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

- 'సాక్షి' దినపత్రికకు ధన్యవాదాలు తెలిపిన గ్రామస్తులు



సాక్షి ఎఫెక్ట్..

ఎల్లారెడ్డి: 'రోడ్డు సరిగా లేక బడి మానేస్తున్న విద్యార్థులు' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. స్టేట్ రూరల్ డెవలప్‌మెంట్ ఫండ్ పథకం కింద రోడ్డు నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ సురేఖ తెలిపారు. రోడ్డు పనులను గురువారం ఎంపీపీ మాధవి, ఎంపీటీసీ సుతారి లక్ష్మి, సర్పంచ్‌తో కలిసి ప్రారంభించారు. సాక్షి యాజమాన్యం, నిధుల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కొమ్మచాటున భానుడు



చెట్ల కొమ్మ చాటున కన్పిస్తున్న సూర్యుడు

మద్నూర్: సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో ఎర్రగా కనిపిస్తూ చెట్ల కొమ్మల చాటున జారుకున్నాడు. మద్నూర్‌లో గురువారం సాయంత్రం సాక్షి క్లిక్ మనిపించింది.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కామారెడ్డి టౌన్: రాజంపేట మండలానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన పలువురు గురువారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో చేరారు. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఆ పార్టీని వీడి పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని షబ్బీర్ అలీ అన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి



డీఏల్‌పీవో సురేందర్, ఎంపీడీవో రఘుకు వినతి పత్రం అందజేస్తున్న జేపీఎస్‌లు

నాగిరెడ్డిపేట: ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్) గురువారం ఎల్లారెడ్డి డీఏల్‌పీవో సురేందర్, ఎంపీడీవో రఘుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నాలుగేళ్ల ప్రొహిబిషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జేపీఎస్‌ల సంఘం మండల అధ్యక్షుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో శ్రీను



మద్నూర్‌లో..

ఎల్లారెడ్డిరూరల్: అగ్నిమాపక వారోత్సవాలను శుక్రవారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అగ్నిమాపక శాఖ అధికారి కిష్టయ్య వెల్లడించారు. ఎల్లారెడ్డిలో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను ఆర్డీవో శ్రీను, తహసీల్దార్ సుధాకర్ గురువారం ఆవిష్కరించారు.

మద్నూర్: మండల కేంద్రంలోని ఫైర్ స్టేషన్‌లో గురువారం అగ్నిమాపక శాఖ వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆ శాఖ అధికారులు, సర్పంచ్ దరాస్ సురేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, అగ్నిమాపక సిబ్బంది నరసింహులు పాల్గొన్నారు.

గాంధారి: అగ్ని ప్రమాదాల నివారణపై సిబ్బంది మారుమూల గ్రామాల్లో అవగాహన కల్పించాలని తహసీల్దార్ గోవర్ధన్ సూచించారు. గురువారం ఆయన అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి, గిర్దావర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



రాజంపేటలో మాట్లాడుతున్న టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి



లింగంపేటలో..

సాక్షి, నెట్‌వర్క్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 16న కామారెడ్డిలో నిర్వహించనున్న ర్యాలీని జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. 50 ఏళ్లుగా కష్టపడి పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ చేసిన అనంతరం పింఛన్ ఇవ్వకపోవడం దారుణం అన్నారు.



తాడ్వాయి మండలం క్రిష్టాజివాడిలో..



నాగిరెడ్డిపేటలో..



సదాశివనగర్‌లో..

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నిజాంసాగర్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ రెండు లక్షల మంది రజకులతో త్వరలో భారీ బహిరంగ నిర్వహిస్తామని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిప్రసాద్ అన్నారు. గురువారం నిజాంసాగర్‌లో ఏర్పాటు చేసిన రజక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11 రాష్ట్రాల్లో వోబీసీ జాబితాలో ఉన్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై హైదరాబాద్‌లో సభ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో రజక సంఘం నాయకులు గంగారాం, రవీందర్, రమేష్, పోచయ్య, బాలరాజు, రవి పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న కబడ్డీ పోటీలు



పోటీలో తలపడుతున్న జట్లు

తాడ్వాయి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖేలో భారత్–జీతో భారత్‌లో భాగంగా మహాత్మజ్యోతిరావు పులే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు గురువారం ఉత్కంఠంగా సాగాయి. శుక్రవారంతో క్రీడలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.50 వేలు, రెండో స్థానం జట్టుకు రూ. 25వేలు, మూడవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 10 వేల చొప్పున నగదు ఇవ్వనున్నట్లు వారు వెల్లడించారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింలు

దోమకొండ: పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగాద లక్ష్మీనర్సింలు అన్నారు. గురువారం దోమకొండలో పద్మశాలి సంఘం సమావేశానికి ఆయన హాజరయ్యారు. సంఘం సభ్యత్వానికి పెద్ద ఎత్తున స్పందన వస్తుందని, కులస్థులందరు రాబోయే ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం నాయకులు ఐరేని నర్సయ్య, సబ్బని ధర్మిపురి, బొమ్మెర రాజయ్య, వెంకన్న, గణేష్, సిద్ధరాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు



ఎల్లారెడ్డి: కార్మిక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఎల్లారెడ్డిలో భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నిర్వహించిన శిబిరంలో పలువురికి చికిత్సలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ సురేంద్రకుమార్, భవన నిర్మాణ సంఘాల నాయకులు లక్ష్మణ్, సాయిలు, శ్యామ్, సాయి బాబా, రజాక్, రాజు, చందు, నారాయణ, ఖలీల్ పాల్గొన్నారు .

'విప్'నకు సీతారాముల తలంబ్రాలు అందజేత



కామారెడ్డి టౌన్: భద్రాచలం సీతారాముల కల్యాణ తలంబ్రాల కోసం ఆర్టీసీ లాజిస్టిక్స్‌లో బుక్ చేసుకున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు గురువారం ఆర్టీసీ లాజిస్టిక్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రాజు వాటిని అందజేశారు. ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ కోరారు.

కనీస వేతనాలు ఇవ్వాలి



మాచారెడ్డి: మండలంలోని పలు గ్రామాల్లో పని చేస్తున్న పశు మిత్రలకు కనీస వేతనం అమలు చేయాలని ఆ సంఘం మండల ప్రతినిధి లావణ్య గురువారం తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయడంతో పాటు గుర్తింపు కార్డులు, సబ్సిడీపై బైకులు, గ్లౌజులు, మాస్కులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పశు మిత్రలు రోజా, భవాని, సునీత, మాధవి ఉన్నారు.

ఇఫ్తార్ విందు ఏర్పాట్లపై ఆర్డీవో సమీక్ష



ఎల్లారెడ్డి: రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని ఇఫ్తార్ విందు ఏర్పాట్ల గురించి ఆర్డీవో శ్రీను గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ముస్లిం నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గానికి 1,500 రంజాన్ కానుకలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ముస్లిం మైనార్టీ నాయకులు గయాజుద్దిన్, ఇమ్రాన్, గౌస్, ముజీబ్, ఖాజాపాషా పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం



భిక్కనూరు: ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. గురువారం సంగిశెట్టి సంఘం సభ్యులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలిరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ నర్సింహరెడ్డి, మాజీ సర్పంచ్ నాగభూషణం గౌడ్ పాల్గొన్నారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాల పంపిణీ



మద్నూర్: రైతులకు సబ్సిడీపై జొన్న రకం గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు పశువైద్య సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పశువైద్యశాలలో గురువారం రైతులకు సబ్సిడీ గడ్డి విత్తనాలను ఆయన పశువైద్యాధికారి బండి విజయ్, సర్పంచ్ దరాస్ సురేష్‌తో కలిసి పంపిణీ చేశారు.

వాహనాల తనిఖీ

పెద్దకొడప్‌గల్: మండలంలోని జగనాథ్‌పల్లి చౌరస్తాలో గురువారం ఎస్సై కోనారెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన ధ్రువపత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వెంకట్, గోరి, అంజి, రామేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బస్ పాసుల కోసం దరఖాస్తుల స్వీకరణ

భిక్కనూరు: దివ్యాంగులకు ఆర్టీసీ అందించే రాయితీ బస్సు పాసుల జారీకి సంబంధించిన దరఖాస్తులను స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆర్టీసీ అధికారులు గురువారం స్వీకరించారు. మూడు రోజుల్లోగా పాసులను జారీ చేస్తామని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు.

తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరం

కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం మే నెల 4న కర్షక్ బీఎడ్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు తెలిపారు. యువకులు రక్తదానం చేయాలని ఆయన కోరారు.

సత్యాగ్రహ సభను జయప్రదం చేయండి

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాలలో నిర్వహించనున్న సత్యాగ్రహ సభను జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని ఆయన కోరారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కేసులు

నస్రుల్లాబాద్(బీర్కూర్): రోడ్లపై ధాన్యం ఆరబోస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏఎస్సై సీతారామమ్మ హెచ్చరించారు. మండలంలోని కిష్టాపూర్, చించెల్లి, అన్నారం, రైతునగర్, దామరంచ, తిమ్మాపూర్, సంబాపూర్, బరంగ్ ఏడ్గి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు.

16న పుస్తకావిష్కరణ

కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో 16న స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో తిరుమల తిరుపతిరావు రచించిన 'సాసు బిల్లి శతకం', రాగగీతి శతకం' పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించనున్నట్లు తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం 16న పరీక్ష

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం 16న పరీక్ష నిర్వహిస్తామని పాఠశాల ప్రిన్సిపల్ సాయిబాబా ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాల స్థలం కబ్జాపై కలెక్టరుకు ఫిర్యాదు

లింగంపేట: మండలంలోని నల్లమడుగు పెద్ద తండా ప్రాథమిక పాఠశాల స్థలం కబ్జాకు గురైందని గురువారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు తండా వాసులు ఫిర్యాదు చేశారు. కబ్జాకు గురైన స్థలాన్ని సర్వే చేయించి, స్వాధీనం చేసుకొని పాఠశాలకు అప్పగించాలని కోరారు.

పేద విద్యార్థుల చదువులకు సహాయం

కామారెడ్డి అర్బన్: శ్రీసరస్వతీ విద్యామందిర్‌లో మూడవ తరగతి చదువుతున్న కళ్యాణి, విహన్ అనే విద్యార్థులు ఫీజులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడటంతో వారికి మాజీ కౌన్సిలర్ అర్కల ప్రభాకర్ యాదవ్, గంగారాం యాదవ్, శ్రీకాంత్, అంజనేయులు, భాస్కర్, అమర్ రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

కేంద్ర పథకాలను ప్రచారం చేయాలి

ఎల్లారెడ్డి: కేంద్రం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని బీజేపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు.

పోస్ట్‌మెన్‌పై ఫిర్యాదు

కామారెడ్డి టౌన్: పోస్టు ద్వారా వచ్చిన బ్యాంకు ఏటీఎం కార్డును కామారెడ్డి తపాల శాఖలో విధులు నిర్వహిస్తున్న పోస్ట్‌మెన్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని రాంచంద్ర అనే వ్యక్తి పోస్ట్ మాస్టర్‌కు ఫిర్యాదు చేశారు.